క్లుప్తంగా

ఆలయాలలో పూజలు



ఆకుపూజ అలంకారంలో శ్రీ ఆంజనేయస్వామి

కడప కల్చరల్ : శ్రావణమాసం ప్రారంభమైంది. గురువారం తొలిరోజున కడప నగరంలోని దేవాలయాలు సందడిగా మారాయి. భక్తుల కళ కనిపించింది. ఈ మాసమంతా వైష్ణావాలయాలలో భక్తుల సందడి పెద్దగా కనిపిస్తుంది. ఈ మాసంలోని నాలుగు శనివారాలలో విశేష పూజోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా భక్తులచే సామూహిక పూజలు నిర్వహించేందుకే ఈ మాసంలో ప్రాధాన్యత ఇస్తారు.

■ కడప నగరంలోని అన్ని ఆంజనేయస్వామి దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. ప్రధానంగా దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఆ తర్వాత కడప నగరం బీకేఎం వీధిలోని శ్రీ కోదండ రామాలయం, నకాష్‌లోని శ్రీ పాండురంగ స్వామి ఆలయం, హౌసింగ్‌బోర్డులోని శ్రీ కోదండరామ స్వామి ఆలయం, ఇందిరానగర్‌లోని శ్రీ భద్రాద్రి రామాలయంతోపాటు నగరంలోని దాదాపు 40కి పైగా ఉన్న వైష్ణావాలయాల్లో మాసమంతా విశేష పూజలు నిర్వహిస్తారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్, నగర ఆలయాల అర్చకులు ఇప్పటికే ఈ మాసంలో చేపట్టాల్సిన విశేష పూజలకు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ విద్య నిర్వీర్యం



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రభుత్వ విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్ ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకు వచ్చి ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎంఆర్ నాయక్, ఉపాధ్యక్షుడు సునీల్, వినయ్, రాహుల్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి ఉక్కు సదస్సు

కడపవైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ముడియం చిన్ని, షాకీర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకుడు

కడప కల్చరల్ : దివంగత సీఆర్ఐ సుబ్బారెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన కుమారులు సీఆర్ఐ సుబ్బారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు సునీల్ జయంత్, దినేష్ కుమార్‌లు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత సంస్థ కార్యాలయంలో యువత రక్తదానం చేశారు. అనంతరం పాత రిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం చేశారు. నగరంలోని పలు ఇతర బాలలు, వృద్ధులు, అనాథల ఆశ్రమాల్లో కూడా అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీఆర్ఐ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యమే ప్రధానం

జమ్మలమడుగు : ఆర్టీసీ కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సక్రమంగా నిర్వహించగలరని డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. గురువారం స్థానిక డిపో ఆవరణలో ఆర్టీసీ కార్మికులకు కేర్ హోమియో వైద్యులు ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, గ్యారేజిలో పనిచేసే కార్మికులకు కంటి చూపుతో పాటు ఆరోగ్యంగా ఉంటేనే వాహనాలు నడుపగలరన్నారు. కార్మికుల కోసం ప్రత్యేకంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామని ప్రతి కార్మికుడు వైద్య పరీక్షలను చేయించుకోవాలని సూచించారు.

పాలకొండల్లో శ్రావణమాస సందడి

మాసమంతా విశేష పూజలు



పాలకొండల వద్ద స్వాగత తోరణం



శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయం

కడప కల్చరల్ : శ్రావణమాసం ప్రారంభమైంది. బుధవారం అమావాస్య అనంతరం గురువారం నుంచి శ్రావణ ఘడియలు మొదలయ్యాయి. పండుగలు, వివాహాలు తదితర శుభ కార్యాలు చాలారోజులపాటు లేకపోవడంతో ప్రజలు శుభాలందించే శ్రావణ మాసం కోసం ఎంతో ఎదురు చూశారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో పూజలు వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని అన్ని వైష్ణవాలయాలలో కూడా విశేష పూజలు నిర్వహిస్తారు.

పాలకొండలు..

కడప నగర శివార్లలోని పాలకొండల్లో శ్రావణ మాసం వచ్చిందంటే భక్తుల సందడి కనిపిస్తుంది. ఆషాడంలో కురిసిన వర్షాలతో ఈ కొండలు పచ్చదనానికి ప్రతీకగా నిలుస్తూ ఆహ్లాదాన్ని అందించేందుకు సిద్ధమయ్యాయి. శ్రావణమాసమేగాక మిగతా రోజులలో కూడా భక్తులు వస్తారు. ప్రత్యేకించి ఈ క్షేత్రానికి శ్రావణమాసంలో మరింత అధిక స్థాయిలో భక్తులు వస్తుంటారు. ఇక్కడ వెలసిన శ్రీ లక్ష్మి పాలకొండ్రాయస్వామి ఆలయాన్ని దర్శించుకుని స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తారు. శ్రావణ మాసమంతా ప్రతిరోజు ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగుతాయి. శనివారాలలో ఉదయం నుంచి విశేష అభిషేకాలు, మూల మూర్తులకు కనుల పండువగా అలంకారం నిర్వహిస్తారు. నిర్వాహకులు ఈ మాసంలోని నాలుగు శనివారాలలో ఆలయం వద్ద అన్నదానం చేస్తారు. కింది నుంచి కొండపైకి వెళ్లేందుకు మెట్ల మార్గం ప్రారంభమయ్యే చోట స్వాగత తోరణం (ఆర్చీ) భక్తులకు ఆహ్వానం పలుకుతూ ఉంటుంది. తోరణం ఎదుట స్వామి వారి పాదాలను ప్రతిష్ఠించారు. కొండపైకి వెళ్లే భక్తులంతా తొలుత పాదాల వద్ద పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు సమర్పిస్తారు. ఆ ప్రాంతంలో మిట్టపల్లాలను సవరించి చదును చేసి మైదానంలా తీర్చిదిద్దారు. వాహనాలు నిలిపేందుకు, భక్తులు పాదాల వద్ద పూజలు చేసేటపుడు వేచి ఉండేందుకు ఈ మైదానం ఎంతో అనుకూలంగా ఉంటోంది.

చరిత్రలో,,

పాలకొండ్రాయస్వామికి దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఒక బంధం ఉంది. దేవునికడప ఆలయాన్ని నిర్మించినపుడు ఆ ఆలయ అర్చకులు ప్రతి శనివారం పాలకొండలకు వచ్చి ఇక్కడి పాలకొండరాయస్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించేవారని కడప కైఫీయత్తులలో 'కడప షహర్ వృత్తాంతం' ద్వారా తెలుస్తోంది. మెట్లపై పాలు పోసుకుంటూ కొండపైకి ఎక్కుతారు గనుక భక్తులు దీన్ని పాలకొండగా పేర్కొంటారు.

ఆహ్లాదం,,

పాలకొండలకు వచ్చే వాళ్లు కేవలం ఆధ్యాత్మికతకేగాక ఆహ్లాదానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. మండే ఎండలో సైతం పాలకొండ లోయలో భారీ వృక్షాల నీడలో ఎంతో చల్లగా ఉండడం విశేషం. అందుకే వేసవిలో కూడా ఆలయానికి భక్తులు వస్తుంటారు. కార్తీక మాసంలో భక్తులు వన భోజనాలు కూడా చేసుకుంటారు. కొండ లోయలో భారీ వృక్షాలు, తీగలు, పొదలు, సెలయేర్లు ఉండడంతో వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. స్వామి ఆలయ సమీపంలో శ్రీ గణపతి, శ్రీ ఆంజనేయస్వామి, గరుడ ఆళ్వార్, అచ్చమ్మ ఆలయాలు ఉన్నాయి. ఆలయం వెనుక, సమీపంలో చిన్న కొలను ఉంది. మరికొంత దూరంలోగల సహజమైన కోనేరు నుంచి పైపుల ద్వారా ట్యాంకరులో నీటిని నిల్వ చేసి భక్తుల కోసం ఉపయోగిస్తారు. నగర ప్రాంతంలో అటు ఆధ్యాత్మికంగా సంతృప్తినిచ్చి మనసుకు ఎంతో ఉల్లాసాన్ని కలిగించే ఈ పాలకొండల్లో శ్రావణమాసమంతా భక్తులు సందడిగా కనిపిస్తారు.

కడప రాయుని ఆలయంలో తిరుమంజన సేవ



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : తిరుమలేశుని తొలి గడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ నిర్వహించారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలకు ముందుగా ఒకసారి, శ్రావణమాసోత్సవాల సందర్భంగా మరోసారి మొత్తం రెండుమార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవలు నిర్వహిస్తారని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, తివిక్రమ్ తదితరులు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పచ్చకర్పూరం, జాజికాయ, పసుపు, జాపత్రి, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో అంతరాలయాన్ని, ఆలయ పరివార దేవాలయాల లోపలి విగ్రహాలను శుద్ధి చేశారు. రోజువారి పూజల్లో వాడుతున్న వస్తువుల ద్వారా గర్భాలయంలో క్రిమి కీటకాల భయం లేకుండా చేసేందుకే ఈ కార్యక్రమం చేపడతారు. ఈ కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటలకు భక్తులకు దర్శనాలు కల్పించలేకపోయారు.

వైవీయూలో స్కేటింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం



ఎంపీఈడీ విద్యార్థులతో వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : వైవీయూలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ శాఖ ఆధ్వర్యంలో గురువారం విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఇన్‌లైన్ స్కేటింగ్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు విశ్వవిద్యాలయం చక్కటి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. విద్యార్థులు చక్కగా సాధన చేసి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని సూచించారు. క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎంపీఈడీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్వాడ్రా (బేసిక్) స్కేట్స్ శిక్షణ అనంతరం ఇన్‌లైన్ స్కేటింగ్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

కంప్యూటర్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

యోగివేమన విశ్వవిద్యాలయం కంప్యూటర్ ల్యాబ్‌లో జూనియర్ అసిస్టెంట్లకు నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. గురువారం విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల హాజరుశాతం, మార్కుల శాతం ఎలా లెక్కించాలో నేర్చుకోవాలన్నారు. వీటితో పాటు ఇంగ్లీషు టైపింగ్, ఎం.ఎస్. వర్డ్, ఎం.ఎస్. ఎక్సెల్ పూర్తిగా నేర్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ సహ ఆచార్యులు డా. కె. శ్రీనివాసరావు, డా. కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన వీసీ

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయంలో ఎమ్మెస్సీ, భూగర్భ శాస్త్ర విభాగపు విద్యార్థులు నేషనల్ జియోఫిజిక్ రీసెర్చ్ సంస్థ హైదరాబాదు నందు భూగర్భజలాల అన్వేషణపై శిక్షణకు ఎంపికయ్యారు. వీరంతా జులై 31 నుంచి ఆగష్టు 12 వరకు శిక్షణను పొంది విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి వచ్చారు. వీరందరినీ వైవీయూ వీసీ చింతా సుధాకర్, ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి, జియాలజి విభాగాధిపతి రఘుబాబు, ప్రొఫెసర్లు సునిత, జయరాజు, శ్రీనివాస్‌గౌడ్, సిద్ధిరాజులు అభినందించారు.

హాస్టల్ విద్యార్థులకు నిత్యావసర సరుకులు



హాస్టల్ విద్యార్థుల కోసం తీసుకొచ్చిన నిత్యావసర సరుకులతో దాతలు

కడప కల్చరల్ : స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని జేఎస్‌ఓఎస్ అర్ఫన్ హాస్టల్‌కు గురువారం కువైట్‌కు చెందిన ఆర్కే హెల్పింగ్ హ్యాండ్స్, మీకోసం సేవా సంస్థలు కలిసి నిత్యావసర సరుకులను అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పూర్వ చైర్మన్ అలపర్తి పిచ్చయ్యచౌదరి ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ జీవనోపాధి కోసం ఆర్కే హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు కువైట్‌లో ఉంటున్నారని, మాతృభూమికి చేతనైన సాయం చేయాలన్న తపనతో ప్రతినెల వేతనంలో కొద్దిమొత్తాన్ని పొదుపు చేస్తున్నారని, ఆ మొత్తంలోనే నిరాశ్రయులు, అభాగ్యులను ఆదుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మీకోసం సేవా సంస్థ అధ్యక్షులు విష్ణువర్దన్, పోలీసు అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, సాయిసేవా సమితి అధ్యక్షులు సాయికుమార్‌రాజు పాల్గొన్నారు.

ఏపీజీఈఎఫ్ చైర్మన్‌కు అభినందనలు



కాకర్ల వెంకట్రామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల ఫెడరేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేసిన ఏపీ జీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డికి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ (జీసీఎల్ఎఫ్ఏపీ) నాయకులు అభినందనలు తెలిపారు. గురువారం కడపకు విచ్చేసిన ఆయనకు జీసీఎల్ఎఫ్ఏపీ నాయకులు పూల గుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు మిఠాయి తినిపించి శాలువాతో అభినందించి కృతజ్ఞతలను తెలియచేశారు. ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్ల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్ర మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెగ్యులర్ చేస్తూ తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల, డిగ్రీ కళాశాలల, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఆయనకు ఆ జన్మాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు లెక్చరర్లు గీత, హఫీజున్నీసా, వేణు, నకీబ్, ఖదీర్‌బాషా, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్ చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం హర్షనీయం అని కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ మన్సూర్ అలీ అన్నారు.

జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి

ఉపాధ్యాయుల రేషనలైజేషన్ జీఓ 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్‌రెడ్డి కోరారు. ఇందుకు సంబంధించిన జీఓను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఈ విషయమై జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డిని కలసి విన్నవించారు. ఈ మేరకు జిల్లా కో చైర్మన్ మల్లెం సుబ్బారెడ్డి, నగర యూనిట్ ప్రెసిడెంట్ శివ శేషాద్రిరెడ్డిలతో కలిసి జమాల్‌రెడ్డి ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఘనంగా 'నా మట్టి.. నాదేశం' కార్యక్రమాలు



మొక్క నాటి మట్టి వేస్తున్న ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య ఆంజనేయప్రసాద్

వైవీయూ/ఏఎఫ్‌యూ: కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో 'నా మట్టి.. నాదేశం' కార్యక్రమం నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఆవరణంలో వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ మొక్కలు నాటి నీరుపోశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఉషా మాధురీ, ఉదయప్రకాష్ రెడ్డి, రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ..

కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో 'మేరా మట్టి.. మేరా దేశ్'లో భాగంగా వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. వై. సావిత్రి, డా. ఎ. నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పథకాల అమలుతో ప్రజలకు మేలు చేశాం

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చామని, అందుకే ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి చేసిన మేలును వివరిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక 27వ డివిజన్‌లోని గౌస్ నగర్, గంజికుంట కాలనీ ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. పలువురు తమ సమస్యలను తెలుపగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. షేక్ ఆయేషా బేగం అనే మహిళ మాట్లాడుతూ తనకు వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత, జగనన్న అమ్మ ఒడి, జగనన్న ఇంటిస్థలం ద్వారా రూ.10.31లక్షల మేలు జరిగిందన్నారు. పఠాన్ ఖీరం బేగం మాట్లాడుతూ తమ కుటుంబానికి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, పింఛన్ కానుక, సున్నావడ్డీ, జగనన్న ఇంటిస్థలం ద్వారా రూ.10.32లక్షల లబ్ధి చేకూరిందని తెలిపింది. ఎస్. గుర్రప్ప అనే వ్యక్తి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, ఇంటి స్థలం ద్వారా రూ.10.05లక్షల మేలు జరిగిందని, గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి కలగలేదని చెప్పాడు. పేదలకు మేలు చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ అరీఫ్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ జహీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, త్యాగరాజు, తోటక్రిష్ణ, పవర్ అల్తాఫ్, బాలక్రిష్ణారెడ్డి, అజ్మతుల్లా, షఫీ, లక్ష్మీనారాయణ, మియ్యా, టీపీ వెంకట సుబ్బమ్మ, నారాయణమ్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం తగదు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు స్వరూప్‌తేజ్ డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా గురువారం కడపలోని డాక్టర్ అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 రోజుల నుంచి విద్యార్థులకు సరైన భోజనం అందించడం లేదన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర సహాయ కార్యదర్శి శ్రీనాథ్, నగర కోశాధికారి రఘురాంసింగ్‌నాయక్ పాల్గొన్నారు.

విలియం కేరి గొప్ప సంఘ సంస్కర్త

కడప రూరల్: విద్యా సంస్థను నెలకొల్పడమే గాక మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేసిన విలియం కేరి గొప్ప సంఘ సంస్కర్త అని బిషప్ డాక్టర్ కే సామ్యూల్‌బాబు అన్నారు. విలియం కేరి జయంతి సందర్భంగా గురువారం అశోక్‌నగర్‌లోని కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కే స్పర్జన్‌కుమార్, ప్రనూష, హెప్సిబా, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ నూతన గ్యారేజీ కమిటీ నియామకం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (కడప) నూతన గ్యారేజీ కమిటీని నియమించినట్లు ఆ యూనియన్ అధ్యక్షులు నాగముని, డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు తెలిపారు. గురువారం నూతన కమిటీని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావుకు పరిచయం చేశారు. కమిటీ గ్యారేజీ ప్రెసిడెంట్‌గా రవికుమార్, సెక్రటరీగా మల్లేష్, ట్రెజరర్‌గా శాంతప్ప, జాయింట్ సెక్రటరీలుగా సీవీ సుబ్బారావు, అసిస్టెంట్ సెక్రటరీలుగా పీవీ సుబ్బారెడ్డి, ఎస్.జిలానీలను ఎన్నుకున్నారన్నారు.

సమాజ హితమే పరిశోధన లక్ష్యం కావాలి

వైవీయూ : సమాజ హితమే పరిశోధనల లక్ష్యం కావాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. గురువారం వైవీయూలోని హ్యూమానిటీస్ భవనంలో పరిశోధక విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువ పరిశోధకులు ఉత్తమ ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. అకుంఠిత లక్ష్యంతో పరిశోధన చేసేవారికి విశ్వవిద్యాలయం అండగా నిలుస్తుందన్నారు. భారతదేశంలో ఊహించని అభివృద్ధి జరుగుతోందని, పరిశోధకులుగా మనం దేశానికి ఒక బలం కావాలన్నారు. మనం రాసే పరిశోధక పత్రాలు స్కోపస్, నాస్ తదితర ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితం కావాలని, అప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు గైడ్‌ను అనుసరించి పరిశోధనలు కొనసాగించాలని సూచించారు. పరిశోధనలు చేసేవారికి ప్రభుత్వ, అనుబంధ పరిశోధక సంస్థలు ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాల పట్ల అవగాహన కల్పించారు. పరిశోధకులకు థింక్ చీక్ సబ్మిట్.కాం వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌లను ప్రజలే శిక్షిస్తారు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లను ప్రజలే శిక్షిస్తారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. గురువారం మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజా కోర్టులో శిక్షిస్తామని వారు పదే పదే మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ చంద్రబాబును చావుదెబ్బ కొట్టినా, రెండు చోట్ల పవన్‌ను ఓడించినా వారికి బుద్ధి రాలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లి, సీఎం వైఎస్ జగన్‌ను తిట్టడానికే వారు యాత్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి కోరారు. గురువారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ బిల్డింగ్ వర్కర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను విడుదల చేయాలన్నారు. కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న ఏఎల్‌ఓ, ఏసీఎల్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 28న కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ఆందోళనను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాధాకృష్ణ, మద్దిలేటి, లింగన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉరుటూరు గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడే ఉన్న అధికారులకు తెలిపి పరిష్కరించారు. వర్షాలు కురిసిన సమయంలో బజార్లలో నీరు నిలువ ఉంటోందని దీంతో దోమలు అధికమవుతున్నాయని, పక్కా గృహాలు, పింఛన్‌లు మంజూరు చేయాలని ఆయనను కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత కలిగి ఉండి మంజూరుకాని వారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.